ప్రజాశక్తి

బుధవారం 28 ఫిబ్రవరి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

బీసెంట్ రోడ్డులో జరిగిన ముగింపు సభలో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

నగరాన్ని అభివృద్ధి చేసే

కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపండి

'సిపిఎం జనశంఖారావం'

పాదయాత్ర ముగింపులో సిహెచ్.బాబూరావు పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : ఇప్పటివరకు రాష్ట్రాన్ని, నగరాన్ని పాలించిన టిడిపి, వైసిపి ప్రజా ప్రతినిధులు నగరాన్ని అభివద్ధికి ఆమడదూరంలో ఉంచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. నగరానికి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని, వచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించలేదని అన్నారు. ఈనెల 22న బాబూరావు నేతృత్వాన సెంట్రల్ నియోజకవర్గంలో చేపట్టిన 'సిపిఎం జన శంఖారావం' పాదయాత్ర మంగళవారం రాత్రి ముగిసింది. ఆరు రోజులపాటు సాగిన పాదయాత్ర ముగింపు సభ బీసెంట్ రోడ్డులోని అన్సారీపార్కు సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు వై.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో బాబూరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని కోరారు. సెంట్రల్ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిని అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. అభివద్ధి చేసే నాయకులకు మీ ఓటు ద్వారా బలాన్ని ఇవ్వాలన్నారు. భూకబ్జాలు, మద్యం దుకాణాలు నిర్వహించే వారిని అసెంబ్లీకి పంపొద్దన్నారు. కమ్యూనిస్టుల పాలనలోనే విజయవాడ అభివద్ధి చెందిందన్నారు. సింగినగర్ ఫ్లైఓవర్, బుడమేరు రెండో వంతెన, మాకినేని బసవపున్నయ్య స్టేడియం, విహెచ్ఆర్ కాంప్లెక్స్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, ఇందిరాగాంధీ స్టేడియం కాంప్లెక్స్ వంటి నిర్మాణాలు కమ్యూనిస్టుల హయాంలో (మిగతా 6లో)

ఎంపి సీటుపై టిడిపిలో ఉత్కంఠ

❀కేశినేని చిన్నితోపాటు అశ్వనీదత్, నెట్టెం రఘురామ్ పేర్లు ❀పొత్తు కుదిరితే బిజెపి అభ్యర్థిగా సుజనా చౌదరి ?

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడ పార్లమెంట్ నియోజక వర్గ టిడిపి టికెట్ ఎవరికి దక్కనుందనే దానిపై ఇంకా ఉత్కంఠ నెలకొంది. వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి కేశినేని నానిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే టిడిపి-జనసేన కూటమి తమ అభ్యర్థిని ఇంత వరకు ప్రకటించకలేదు. దీనికితోడు సర్వే ఆధారంగా టికెట్ ఖరారు చేస్తుండటంతో అటు నేతల్లో కూడా ఒకింత టెన్షన్ నెలకొంది. ఇప్పటిదాకా సిట్టింగ్ ఎంపి కేశినేని నాని సోదరుడు కేశినేని చిన్నీ పేరు బాగా వినిపించింది. చిన్ని గత మూడేళ్లుగా విజయవాడ పార్లమెంట్ పరిధిలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. పార్టీ సమావేశాలకు హాజరవుతూ ఆ పార్టీ శ్రేణులకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రముఖ టిడిపి నేతలందరినీ సమన్వయం చేసుకుంటూ వారి ద్వారా సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. దీంతో ఆ పార్టీ పెద్దల దృష్టిలో పడ్డారు. ప్రత్యర్థి అభ్యర్థికి స్వయాన సోదరుడు కావడం, ఆర్థికంగా స్థోమత కలిగి ఉండటం తదితర అంశాల ఆధారంగా చిన్నికే సీటు దక్కుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. మరో వైపు ఇది వరకే టిడిపి పెద్దలు చంద్రబాబు, లోకేష్‌తోపాటు జనసేన అధక్షులు పవన్ కల్యాణ్‌ను కూడా చిన్ని కలిశారు. ఈనేపథ్యంలో ఆయనకే టికెట్ ఖరారు కావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఆయనకు అదిష్టానం నుంచి ఎలాంటి హామీ లేక పోవడంతో ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే

సుజనా చౌదరి

కేశినేని చిన్ని, నెట్టెం రఘురాం, అశ్వనీదత్

విజయవాడ టిడిపి ఎంపి అభ్యర్థులుగా ప్రముఖ సినీ నిర్మాత అశ్వనీదత్‌తో పాటు ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వీరు చంద్రబాబుకు సన్నిహితులు కావడం వల్ల వీరిలో ఒకరికి సీటు దక్కే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. మరోవైపు బిజెపితో పొత్తు కుదిరితే మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరిని రంగంలోకి దింపుతారని ఆ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. టిడిపి ఇటీవల విడుదల చేసిన తొలి జాబితాలో ఈ ఎంపి స్థానంతోపాటు విజయవాడ పశ్చిమ, మైలవరం తప్ప తక్కిన తిరువూరు, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. మరోవైపు అభ్యర్థుల ఎంపికకు ముందు టికెట్ కసం పోటీపడుతున్న వారిపై ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. ర్యాండమ్‌గా కొన్ని ఫోన్ నంబర్లు ఎంపిక చేసి వారికి ఫోన్లు చేసి పలానా అభ్యర్థి ఎంపిగా పోటీ చేస్తున్నారు, వారిపై మీ అభిప్రాయం చెప్పండి అంటూ అడుగుతున్నారు. అలా ఫోన్ల ద్వారా వచ్చే అభిప్రాయాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఎంపి సీటు ఎవరికి కేటాయిస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది.

వార్త 7లో

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సురేష్ కుమార్

ప్రశాంతంగా టెట్ ప్రారంభం

కార్యక్రమంలో ఆర్‌బిఐ జిఎం ఆర్.కె.మహాన తదితరులు

ప్రజలకు, బ్యాంకులకు మధ్య వారధి

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు

ఆర్‌బిఐ జిఎం ఆర్.కె.మహాన

ప్రజాశక్తి - విజయవాడ : బ్యాంకు పథకాలు, సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఆర్.కె.మహాన అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్పిస్తున్న సామాజిక భద్రత పథకాలు, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లకు సూచించారు. గ్రామీణ ప్రజలకు సైబర్ నేరాలపై అప్రమత్తంగా (మిగతా 6లో)

సత్యనారాయణపురంలో దారుణం

- కొబ్బరిబొండాల కత్తితో ఉపాధ్యాయురాలిపై దాడి
- ఫ్యానుకు ఉరేసుకొని నిందితుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురంలో దారుణం చోటుచేసుకుంది. నాని అనే వ్యక్తి వక్కలగడ్డ మాధురి అనే మహిళా ఉపాధ్యాయురాలిని కొబ్బడి బొండాల కత్తితో మెడభాగాన నరికి, అనంతరం అతను కూడా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెను వైద్యశాలకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... వక్కలగడ్డ మాధురి, ఆమె భర్త పవన్‌కుమార్ ఇద్దరూ కృష్ణాజిల్లా గుడివాడలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. అలాగే మృతి చెందిన నాని కూడా గుడివాడలో రియల్ ఎస్టేట్ వ్యాపారంతోపాటు(మిగతా 6లో)

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ఉద్యోగ అవకాశాలు

విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పని చేసేందుకు కింది ప్రాంతాలకు విలేకరులు కావలెను.

విద్యార్హత: ఇంటర్, ఆ పైన..

విలేకరులు కావాల్సిన కేంద్రాలు:

ఎన్‌టిఆర్ జిల్లా
- విజయవాడ నగరంలో నాలుగు ఖాళీలు
- విజయవాడ రూరల్
- జి.కొండూరు

కృష్ణాజిల్లా
- పెనమలూరు
- పామర్రు
- నాగాయలంక
- గూడూరు
- కృత్తివెన్ను
- నందివాడ

ప్రాథమిక అర్హతలు :
- తెలుగులో స్పష్టంగా రాయగల నైపుణ్యం
- జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రాథమిక అవగాహన
- కంప్యూటర్ తెలుగు టైపింగ్
- ఏదైనా తెలుగు పత్రికలో ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత..

ఆసక్తి గల వారు తమ బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్‌గానీ, vjadesk@gmail.com మెయిల్‌కుగానీ పంపగలరు

:: హాజరుకావాల్సిన చిరునామా ::
ప్రజాశక్తి కార్యాలయం
అరవింద హైస్కూల్ వద్ద, తాడేపల్లి

సంప్రదించాల్సిన నెంబర్లు
9490099206, 9490099530, 9490099218

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిబాబా

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్నికల విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, నందిగామ ఆర్డీవో పి.సాయిబాబా హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బూత్ లెవెల్ ఆఫీసర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆర్డిఓ సాయిబాబు, తహశీల్దార్ వి.సుస్వాగతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో సాయిబాబు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారులు సూచించిన నిబంధనలు పాటించాలని, ఓటర్ల లిస్టులో తప్పొప్పులు సరిచూసుకోవాలని, పోలింగ్ స్టేషన్ల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వికలాంగులకు ర్యాంప్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షేక్ నాగుల్ మీరా, సూపర్వైజర్లు, బిఎల్ఒలు, సెక్టర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వ్యాపారులతో ఏసిపి సమావేశం

ప్రజాశక్తి - విస్సన్నపేట : జ్యూవెలరీ వ్యాపారస్తులతో, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో మైలవరం ఏసిపి మురళీ మోహన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తమ కొంచెం నాణ్యత గల సిసి కెమెరాలు అమర్చాలని, సిసి కెమెరాలు పర్యవేక్షణ ఉండాలని, ఇన్ఫర్మేషన్ బ్యాక్అప్ తప్పనిసరిగా ఉండాలని, అప్పుడు మాత్రమే ఇటువంటి నేరాలు చేసిన వారిని పట్టుకోవడానికి, సహకారంగా ఉంటుందని అన్నారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు షాప్ ముందు వాహనాలు క్రమ పద్ధతిలో నిలపాలని షాప్ నేమ్ బోర్డ్స్ రోడ్డు మీదకి అడ్డంగా పెట్టడం వలన కొనుగోలుదారులు వారి వాహనాలు రోడ్డు మీదకి అడ్డుగా నిలిపి రావడంతో ప్రమాదాలకు నెలవుగా ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ షాప్ యజమానులు, ఇతర వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో జరిగిన పూర్ణాహుతి కార్యక్రమా లతో పెద్ద తిరునాళ్ళ ఉత్సవాలు ముగి శాయి. ముందుగా కలశ పూజలు, రక్షాబం ధనం, పుణ్యాం వచనం వంటి పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు పురోహి తులు నిర్వహిం

చారు. అనంతరం ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు దంపతులు, అమ్మవారి కళ్యాణ పీటలపై కూర్చున దంపతులు, అమ్మవారి, స్వామి వారి వంశీయులు, పూర్ణాహుతి కార్యక్రమంలో కూర్చుని ఆలయ వేద పండితులు కిరణ్ శర్మ లక్ష్మణ్ శర్మ దిలీప్ కుమార్ శర్మ ల వేదమంత్రోచరణ లతో పురోహితులు ఆంజనేయ శర్మ, అర్చకులు గోపి లో ఆధ్వర్యంలో మేళా తాళాలతో పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి, స్వామి వారి వంశీయులను ఆలయ అధికారులు నూతన వస్త్రాలతో సత్కరించారు. కొంతమంది దీక్ష స్వాములు అమ్మవారికి తిరుముడులు సమర్పించి దీక్షను విరమించారు. చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులకు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

జయంతిలో వైసిపి నేతలు పాదయాత్ర

ప్రజాశక్తి - వీరులపాడు : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ వైసిపి అధికారం చేపట్టాలని శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వీరులపాడు మండలం జయంతి గ్రామంలో వైసిపి పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి ఇప్పల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది వైసిపి కార్యకర్తలతో కలిసి కంచికచర్ల మండలం పరిటాల శ్రీ అభయ వీర హనుమాన్ ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎంఎల్‌సి డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాదయాత్రను ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల ఆశయాలకు అనుగుణంగా పాలనందిస్తున్న ముఖ్యమంత్రి జగనే నన్నారు. వైసిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పూర్తిగా రూపుమాపి ప్రజలకు స్వచ్ఛమైన పాలనఅందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పాదయాత్ర పెద్దాపురం చేరుకున్న సమయంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి పాదయాత్ర చేసే వారికి స్వాగతం పలికి యూత్

పాదయాత్రలో పాల్గొన్న కృష్ణారెడ్డి

నాయకుడు ఇప్పల కృష్ణారెడ్డిని అభినందించారు. జయంతి గ్రామంలో మొదలైన పాదయాత్రలో మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జడ్పిటిసి సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, మాజీ జడ్పిటిసి సభ్యులు కోటేరు ముత్తారెడ్డి, గ్రామ సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు జంగా కోటిరెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు. పాదయాత్రకు జుజ్జూరులో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు ఎస్‌కె నాగుల్ మీరా పోలా పుల్లయ్య గోపిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేని అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలు అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లు జోరుగా కొనసాగుతున్న వైనం నెలకొంది. నందిగామ లోని 5, 6, 8, 9, 10, 12, 14 వార్డులలో యదేచ్ఛగా జి+2 అనుమతులు తీసుకొని జి5,6 మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫ్లోర్లతో అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. పట్టణ పరిధిలో కుమారస్వామి వెంచర్ పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా మునేటి ఒడ్డున భారీగా ఏడు ఎకరాల స్థలంలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారు. సిఆర్‌డిఎ, మున్సిపల్ , రెవిన్యూ అనుమతులు లేకుండా మునేటి ఒడ్డున రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత మంతా గత వర్షాలకు నీట మునిగి అతలాకుతలమైంది. అలాంటి ప్రమాదకరపు స్థలాల్లో మధ్య తరగతి ప్రజలనే టార్గెట్ చేస్తూ వారికి మాయమాటలు చెప్పి రియాల్టర్లు అంటకట్టేస్తున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఎకరానికి 10 సెంట్లు మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలి, కానీ ఆ స్థలాన్ని కూడా పేద మధ్య తరగతి ప్రజలకు రియాల్టర్లు అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. మున్సిపల్

నిబంధనల ప్రకారం జిప్లస్‌టు నిర్మాణాలు మాత్రమే చేపట్టాలి. కానీ కాసులకు కక్కుర్తి పడి గత అధికారులు అక్రమ కట్టడాలకు రియల్ ఎస్టేట్ వెంచర్లకు ప్రోత్సహించారు. ప్రస్తుత మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి ఈ అక్రమ నిర్మాణాలపై , అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకొని సామాన్య మధ్యతరగతి ప్రజలను ఏ విధంగా కాపాడతారో అని నందిగామ ప్రజానీకం వేచి చూస్తున్నారు.

యాత్రికుల కానుకల విషయంలో ఘర్షణ

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం పెద్ద తిరునాళ్ళ మహోత్సవాలు సందర్భంగా మంగళవారం పూర్ణాహుతి కార్యక్రమం ముగిసిన పిమ్మట దీక్ష స్వాములు, యాత్రికులు సమర్పించిన కానుకల విషయంలో అర్చకుల మధ్య జరిగిన ఘర్షణలకు కార్యనిర్వణాధికారి, డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు వెంటనే స్పందించారు. ఆలయ పరువు ప్రతిష్టాలకు భంగం వాటిల్లుటకు కారకులైన ఉప ప్రధాన అర్చక ద్వారక రావు, గురుస్వామి యం.సూరిబాబు., ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న జి.కాసులుపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ ఆలయ అధికారులకు సూచించారు. ఈ మేరకు వారిని తాత్కాలికంగా విధుల నుండి తొలగిస్తున్నట్లు, సంజాయిషీ ఇవ్వాలని కోరినట్లు ఆలయ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు.

వివాదానికి కారణం...

ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు దీక్షా స్వాములు తిరముడిలు కట్టుకుని అమ్మవారికి సమర్పించిన తదుపరి మాలధారణ తీసేందుకు అర్చకులు వద్దకు వచ్చారు. ఆసమయంలో దీక్షా గురుస్వామి

కానుల విషయమై ఘర్షణ పడుతున్న అర్చకులు

అందుబాటులో లేకపోవడంతో ఉప ప్రధాన అర్చకుడు స్వాములు మాలధారణ తీశారు. ఆ క్రమంలో పలువురు దీక్షా స్వాములు, యాత్రికులు కొంత కానుకలు అర్చకుడికి అందించారు. తిరుముడి కట్టు సమయంలో, పూర్ణాహుతి కార్యక్రమాల్లో కూడా భక్తులు కానుకలు యిచ్చారని ఆలయ అర్చకులు కొంతమంది మాకు కూడా కానుకలు పంచాలని వాగ్వాదానికి దిగ్గారు. ఈ లోగా గురుస్వామి కూడా అక్కడికి చేరుకుని ఇరువర్గాలు అర్చకులు పరస్పర వ్యక్తిగత దూషణలు లతో అసభ్య పదజాలంతో ఒకరికొకరు ఘర్షణలకు పాల్పడ్డారు.

వరికి సరిపడా నీరుండేలా చూడాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట, వత్సవాయి : ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వరికి సరిపడినంత నీరు ఉండేలా చూస్కోవాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ఎస్.కృష్ణంరాజు తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో పంటకు అవసరమయ్యే నీటిని 2-3 సెంటీమీటర్లు తగ్గకుండా చూస్కోవాలని సూచించారు. నీరు సమృద్ధిగా లేని సమయంలో లీటర్ నీటికి 13.0.45 శాతం పొటాషియం

వరిని పరిశీలిస్తున్న దృశ్యం

నైట్రేట్ అనే పోషకాన్ని లీటర్ నీటికి 5 గ్రాములు పిచికారీ చేసుకోవాలని చెప్పారు.

భద్రపరిచేందుకు తీసుకెళ్తున్న పరీక్షా పత్రాలు

పోలీస్‌స్టేషన్లో ఇంటర్ ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి - గంపలగూడెం: మార్చి నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి పరీక్షల ప్రశ్నాపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్లో భద్రపరచబడ్డాయి. ఈ మేరకు విజయవాడ నుండి సోమవారం గంపలగూడెం వచ్చాయి. మండల వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు 550 మంది పరీక్షల్లో పాల్గొననున్నారు. ఎపి మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరం 150 మంది, ద్వితీయ సంవత్సరం 120, మొత్తం 270, కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 147, ద్వితీయ సంవత్సరం 130 వెరసి 2802 సెంటర్లలో మొత్తం 550 మంది విద్యార్థులు-విద్యార్థులు పాల్గొంటారు. ఆయా సెంటర్ల సిఎస్‌లు, డిఒలు వరుసగా, కెఎస్ఆర్ ప్రసాద్, ఎస్ నాగుల్ మీర, కె.రాంబాబు పీవీ లక్ష్మణరావు సదరు పరీక్ష పత్రాలను భద్రపరిచిన వారిలో ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కొలికపూడి వ్యాఖ్యలపై మండిపాటు

ప్రజాశక్తి - తిరువూరు : టిడిపి తిరువూరు నియోజకవర్గ అభ్యర్థిగా టికెట్ సంపాదించి పట్టుమని వారంరోజులు కూడా కాకముందే కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై వైసిపి నాయకులు మండిపడుతున్నారు. సోమవారం కొలికపూడి గృహప్రవేశం చేసిన సందర్భంగా 60 రోజుల తరువాత ఈ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ఉండలేడని, ఒక్క రాజశేఖరరెడ్డి విగ్రహం కూడా మిగలదని వ్యాఖ్యానించడాన్ని వైసిపి నాయకులు విమర్శిస్తున్నారు. తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, వేలుగోటి విజయలక్ష్మి, కంభంపాడు ఎంపిపి భర్త కాలసాని చెన్నారావు, తదితర నేతలు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొలిక పూడికి సవాల్ విసిరారు.

అల్పాహారం వడ్డిస్తున్న దృశ్యం

'పది' విద్యార్థులకు అల్పాహారం

ప్రజాశక్తి - తిరువూరు : పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని అదనపు తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో దాతల సహకారంతో గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.ఆదిలక్ష్మి మంగళవారం తెలిపారు. విద్యార్థులకు గోధుమ రవ్వ ఉప్మా, బిస్కెట్స్, అరటి పండ్లను అల్పాహారం క్రింద అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిరాం, రాజేంద్ర ప్రసాద్, రాంప్రదీప్, సుదర్శన్, వెంకటేశ్వర్లు, రాము పర్యవేక్షించారు.

పైలెట్ ప్రాజెక్టులో మురుగునీరు కలిస్తే ఉద్యమం : సిపిఎం


గండిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం పట్టణంలోని సగం మంది ప్రజలకు మంచినీటిని అందించే పైలెట్ ప్రాజెక్టులో మురుగును నీటిని కలిపేందుకు కొట్టిన గండిని తక్షణమే పూడ్చివేయాలని లేకపోతే ప్రజలందరితో కలిసి ఉద్యమిస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. గన్నవరం పట్టణంలో పైలెట్ ప్రాజెక్టుకు కొట్టిన గండిని సిపిఎం నాయకులు పటాన్ సర్దార్, మిరప నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, చెరువుగట్టు ప్రసాద్, పంచాయితీ వార్డు సభ్యులు గుండిమెడ ఉదయ భాస్కరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటి చెరువులోకి తొండంగట్టు చెరువులో ఉన్న మురుగునీటిని మళ్లించడం సరికాదన్నారు. నీరు కలుషితం వల్ల అనేక రోగాలు వచ్చి ప్రజలు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఇప్పటికే ఎస్టీ కాలనీలోని మురుగు తొండంగి చెరువులో కలుస్తుందని చెప్పారు. అంతేకాకుండా మర్లపాలెం గన్నవరం పరిధిలోని పొలాల్లో మురుగునీరు కూడా ఆ చెరువులోనే చేరుతుందన్నారు. పంచాయితీ అధికారులు తొండంగట్టులో చేపల పెంపకానికి అనుమతి ఇవ్వడంతో చెరువులో వ్యర్థాలను కలుపుతున్న విషయం గుర్తు చేశారు. ఈ క్రమంలో తొండం గట్టులోని నీరంతా కలుషితమైందని దానిని పైలెట్ ప్రాజెక్టు మంచినీటి చెరువులో కలపడం వల్ల పూర్తిగా నీరు కలుషితమై ప్రజలకు పంచే పరిస్థితి వస్తుందన్నారు. పాత గన్నవరం, సొసైటీ పేట, ముస్లింపేట, కొత్తపేట, రజకులపేట, రామానగర్ ఏరియాలో ప్రజలకు ఈ చెరువు నుంచే నీటిని మళ్లిస్తున్నట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు మురుగునీటితో చెరువును నింపాలనే ఆలోచనకు స్వస్తి పలకాలని లేకపోతే ప్రజలను కలుపుకొని పంచాయతీని ముట్టడిస్తామని తెలిపారు.

షూటింగ్ బాల్ వరల్డ్ కప్‌కు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం: మార్చి ఒకటి నుండి ఢిల్లీలో జవహర్లాల్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం జరగనున్న షూటింగ్ బాల్ పోటీలకు గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామానికి చెందిన కమర్ బాష్, విజయవాడకు చెందిన పెరవల్ విజయ్ ఎంపికైనట్లు కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఏషియన్ గేమ్స్‌లో విజయ్ మూడో స్థానం సాధించినట్లు తెలిపారు. షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ఇద్దరు ఎంపిక రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

గంగానమ్మ ఆలయం పునఃప్రతిష్ట

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆలయ పునర్ ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన మహా చండీయాగం వద్దకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ హాజరయ్యారు. శ్రీ గంగానమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కోట యుగంధరరావు మండలిని దుశ్శాలువాతో ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు అవనిగడ్డ టిడిపి మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, యాసం చిట్టిబాబు, అవనిగడ్డ మాజీ జెడ్పిటిసి సభ్యులు కొల్లూరి వెంకటేశ్వరరావు, గోగినేని సోమశేఖర్‌రావు, బడే భావనారాయణ, మేడా శివాజీ, తోట రాంబాబు, వేమూరి ప్రభాకర్ రావు, వేములపల్లి శ్రీకృష్ణ, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, దావు మల్లి ,బొడ్డు వెంకన్న, బడే పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత కుండీకి రెండో బహుమతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా 9వ తరగతి విద్యార్థులకు ప్రవేశపెట్టిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (డిఎంపిడి)లో పాల్గొన్న మొవ్వ శ్రీ మండల కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు చేసిన అంశం రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆ అంశాన్ని తయారుచేసిన 9వ తరగతి బి సెక్షన్ విద్యార్థులు వీర్ల శివ నాగరాకేష్ బాబు, జి శ్రీ సాయి గోపి, వి అంకవీర నాగమోహన్.కుమార్, గైడ్ టీచర్ డి.వసంత్ కుమార్ లను లను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, జిల్లా సైన్స్ అధికారిగానున్న బోటని ఉపాధ్యాయులు మహమ్మద్ జాకీర్ అహ్మద్ లు సోమవారం అభినందించారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఏ టూల్ ఫర్ బైలర్స్ అనే అంశాన్ని రూపొందించి ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రదర్శించగా మొదటి స్థానం పొందిరాష్ట్ర స్థాయికి ఎంపికైందని వచ్చే నెల 7వ తారీఖున విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. వ్యవస్థాపక మనస్తత్వ

రెండో బహుమతి గెలుచుకున్న విద్యార్థులు

అభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో సజనను, నైపుణ్యాలను దానితోపాటుగా ఆర్థిక స్వలంబనను కూడా వెలికితీయటమే లక్ష్యం అని వారు తెలిపారు. దీనితోపాటుగారాష్ట్రస్థాయికి మండలంలోని పెద్ద ముత్తేవి శ్రీ లక్ష్మీపతి స్వామి విద్యా విహార్ సాంస్కృతోన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు రూపొందించిన పర్యావరణహిత కుండి రెండవ బహుమతిని కైవశం చేసుకుని రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు.

రూ.10 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైయస్సార్ అవార్డులలో భాగంగా నాట్యకళాపీఠంకు డాక్టర్ వైయస్సార్ లైఫ్ అచీవ్మెంట్ అవార్డుకు ఎంపికవ్వగా అప్పట్లో పది లక్షల రూపాయలను అందజేశారు. వాటిలోని నిధులతో తెలంగాణలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో వర్క్ ఇన్స్పెక్టర్ కె బాబు అంచనాలు రూపొందించి రహదారిని పనులను ప్రారంభించారు. 100 మీటర్లకు పైగా నిడివిగల రహదారిని ఐదు మీటర్ల వెడల్పుతో ఆరు అంగుళాల మందంతో కళా పీఠం భవనం వద్ద, హాస్టల్ వద్ద ఏర్పాటు చేస్తున్న రెండు ప్లాట్ఫారంతో కలిసి ఆరు లక్షల రూపాయలకుపైగా వ్యయం అవుతుందని అధికారులు వెల్లడించారు. రహదారి పనులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అధికారులకు కళా పీఠం పర్యవేక్ష కులుపి పార్థసారథి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, లైబ్రేరియన్ వైవి ఫణికుమార్ పాల్గొన్నారు.

బిళ్లపాడులో రాము పర్యటన

ప్రజాశక్తి-గుడివాడ రూరల్

కుప్పం సభలో టీడీపీ అధినేత చంద్రబాబును ఉద్దేశించి సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన మానసిక వైకల్యానికి నిదర్శనమని గుడివాడ టిడిపి ఇంచార్జ్, నియోజకవర్గ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం గుడివాడ రూరల్ మండలం బిళ్లపాడు గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, ఇంటికి టిడిపి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిళ్లపాడు సెంటర్లో టిడిపి జెండా ఎగరవేసి, భారతరత్న అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించి, దేవాలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ - సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రత్యేక విజన్‌తో గుడివాడ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్

యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, సీనియర్ టిడిపి నాయకులు గోర్జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ: మొవ్వ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కృష్ణాజిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. శ్రీదేవి మంగళవారం మొవ్వ మండల తాసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మితో కలిసి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మొవ్వ, గూడపాడు వేములమడ, కోసూరు, కాజ, పద్దారాయుడు తోట కేంద్రాల తీరుతెన్నులను, పూర్తిస్థాయిలో పరిశీలించి ఆయా పోలింగ్ స్టేషన్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందుగా అయ్యంకి, పెదసనగల్లు, భట్లపెనుమర్రు, బార్లపూడి, కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, టాయిలెట్లు, దివ్యాంగులు వద్దులు పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లటానికి వీలుగా ర్యాంపులు, గాలి వెలుతురు తదితర అంశాలపై పరిశీలించారు. డిప్యూటీ తహశీల్దార్ సిహెచ్ గోపాలరావు, ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులు, వీఆర్వోలు, డీఈవో.వి.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు వైఎస్సార్ బ్రిడ్జిపై మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మాజీ మంత్రి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) సుమారు మూడు లక్షల సొంత నిధులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లుగా మండల యువజన నాయకుడు గుదే రవి తెలిపారు. వారం రోజుల్లో ఈ విగ్రహ ప్రారంభోత్సవాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 2005లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న హయంలో లోయర్ పుల్లేరు కాలువల పై ఉన్న చిన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని తొలగించి ఆ స్థానంలో కోట్లు వెచ్చించి వై షేప్ ఆకారంలో ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన చేశారు 2008లో ప్రారంభం జరిగింది. మచిలీపట్నం గుడివాడ, ముదినేపల్లి రాకపోకలు ఈ బ్రిడ్జి పై ప్రయాణించేందుకు సులువైనది. ఈ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో వాహన చోదకులు, గ్రామ ప్రజలు అప్పట్లో హర్షం వ్యక్తం చేశారు.

రాజధాని రైతులకు కౌలు చెల్లించాలి

సిపిఎం రాజధాని కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-తుళ్లూరు: రాజధాని రైతులకు తక్షణమే కౌలు చెల్లించాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ డిమాండ్ చేస్తుందని రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐడి విచారణ పేరుతో మూడేళ్లుగా అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించడం లేదని, దళితులు, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతులు ఉపాధి లేక, కౌలు సొమ్ము కూడా దక్కక ఎలా జీవనం సాగిస్తారని ప్రభుత్వాన్ని నిలదీసింది. 2023 మే నెలలో అమరావతి రాజధాని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వార్షిక కౌలు ను 10 నెలలు గడుస్తున్నా ఇదిగో, అదిగో చెల్లిస్తున్నాం అంటూ కాలయాపన చేయడం తప్ప నేటి వరకు రైతులకు కౌలు చెల్లించకపోవడం, అమరావతి రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతుల పట్ల కక్ష సాధింపు చర్యలు మానుకొని రైతులకు,అసైన్డ్ రైతులకు చెల్లించాల్సిన వార్షిక కౌలును తక్షణం చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం సి ఆర్ డి ఏ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కౌలు చెల్లింపు నిమిత్తం రూ 240 కోట్లు విడుదల చేసామంటూ సి ఆర్ డి ఏ కమిషనర్ ఆర్భాటపు ప్రకటనలు చేయడం తప్ప, రైతుల అకౌంట్ల లో రూపాయి జమ చేయలేదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వము అధికారులు ఉత్త మాటలు చెప్పడం మాని కౌలు చెల్లింపుకు చర్యలు చేపట్టకపోతే సి ఆర్ డి ఏ కార్యాలయం వద్ద రైతులను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

ముగిసిన సిపిఎం జనశంఖారావం పాదయాత్ర

చివరి రోజున 23 నుంచి 26 వరకు డివిజన్లలో ప్రచారం - ఇంటింటికీ , వీధివీధికీ సమస్యలే

ధ్వంస చేసిన షట్టర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

సినీ ఫక్కీలో చోరీకి యత్నం

చోరీ యత్నానికి ఉపయోగించిన పరికరాలు

ప్రజాశక్తి విసన్నపేట : విస్సన్నపేట మెయిన్ రోడ్‌లో ఉన్న హరిప్రియ జ్యువలరీ షాప్‌లో చోరీకి విఫలయత్నం జరిగింది. హరిప్రియ జ్యువెలరీ మార్ట్ నగల దుకాణంలో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. జులాయి సినిమాలో మాదిరి షాపు వెనుక భాగంలో గ్యాస్ సిలెండర్ కట్టర్‌తో తాళాలు తొలగించి షట్టర్ కట్‌చేసి, షాప్ లోపలికి జొరబడ్డారు. ఇంతలో చుట్టుపక్కల వారు రావడంతో పరారవటంతో ఎటువంటి వస్తువులు చోరీకి గురవలేదని షాపు యజమాని తెలిపారు. విస్సన్నపేట ఎస్‌ఐ జి.రామకష్ణ, జివివి సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మాట్లాడుతున్న శ్రీరాం తాతయ్య

క్రీడాకారులకూ వేధింపులు : టిడిపి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : వైసిపి నాయకుల అహం ఏపీలో క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిని దెబ్బ తీస్తోందని వైసిపి నేతల ఒత్తిళ్లతో తెలుగుతేజాలు ఎన్నో పక్క రాష్ట్రాలకు వెళ్లి వారి అదృష్టాన్ని పరీక్షించుకుంటు న్నారన్నారని మాజీ ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ అన్నారు. పట్టణంలో ఆయన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తనదైన శైలిలో ప్రత్యర్థులకు చుక్కలు చూపించే క్రికెటర్ హనుమ విహారి వైసీపీ నేతల ఒత్తిళ్లకు బలి కావాల్సి వచ్చిందన్నారు. వైసీపీ నేత కుమారుడిని మందలించిన పాపానికి విహారిని ఆంధ్ర రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించేలా కుట్ర చేశారన్నారు. విహారీ తప్పేమి లేదని టీం సభ్యులు ఒకపైపు స్పష్టంగా చెప్పినా వైసీపీ నేతల వేధింపులు ఆగలేదని అన్నారు. విహారీని కెప్టన్‌గా కొనసాగించాలని ఆశ్విన్‌తో సహా అనేక మంది మద్దతుగా నిలిచారన్నారు. 28 తాడేపల్లిగూడెం నియోజకవర్గం, పెంటపాడు మండలం, ప్రత్తిపాడులో నిర్వహించే టిడిపి, జనసేన ఉమ్మడి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూకల కుమార్ రాజా, మేక వెంకటేశ్వర్లు కట్టా వెంకట నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : కిశోర బాలికల అవగాహన సదస్సు తిరువూరు ఐసీడీ ఎస్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం తిరువూరు జడ్పీ బాలికోన్నత పాఠశా లలో మంగళవారం జరిగిం ది. బాల్య వివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాలపై జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అధికారిణి ఉమాదేవి, డీసీపీఓ జాన్సన్, అర్డిఓ మాధవి, సిడిపిఒ సత్యవతి, ఎసిడిపిఒ రఘానీ అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలుంటాయన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న బాబూరావు, తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : చివరి రోజు అయిన 6వ రోజు (మంగళవారం) సిపిఎం జన శంఖారావం సెంట్రల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో జరిగింది. 23,24,25,26 డివిజన్లలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఆయా డివిజన్ల పరిధిలోని కస్తూరిబాయిపేట, గిరిపురం, సీతారాంపురం, మైసూర్ కేక్ సెంటర్, మాచవరం డౌన్, ఆంజనేయస్వామి గుడి, ఎస్ఆర్ఆర్ కళాశాల, మారుతీనగర్, అల్లూరి సీతారామరాజు రోడ్డు, మెడికల్ ఆఫీసు ఏరియా, కురమయ్య స్కూల్, అరండల్‌పేట, సంజీవి కాలనీ, లెనిన్ సెంటర్, ముఠా బ్రహ్మయ్య సెంటర్, అన్నపూర్ణ సెంటర్, ఎన్‌టిఆర్ కాంప్లెక్స్, బీసెంట్ రోడ్డు, రూప్‌కళ, చేపలమార్కెట్ సెంటర్‌లో రాత్రికి శంఖారావం కార్యక్రమం ముగిసింది. ప్రజలు అడుగడుగున స్వాగతం పలుకుతూ తమ సమస్యలను బాబురావుకు విన్నవించారు. తొలుత రెడ్ సర్కిల్ సెంటర్లో బెల్లపు సోమనాద్రి విగ్రహానికి, శిఖామణి సెంటర్లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహాలకి పూలమాల వేసి పాదయాత్రను ప్రారంభించారు. ాళ్ల సమస్య, పట్టాలు, రిజిస్ట్రేషన్లు కావడం లేదని, 300 యూనిట్లు కరెంటు దాటితే పేదలైన సరే ప్రభుత్వ పథకాలు రావడం లేదని ప్రజలు నేతలకు వివరించారు. సెంటు స్థలం ఉంటే పేదవాడికి కూడా పథకాలు నిలిపిస్తున్నారని, రకరకాల కుంటి సాగులతో పెన్షన్లు ఎగ్గొడ్తున్నారని, పథకాలు ప్రచారం తప్ప అందింది అంతంత మాత్రమేనని పేదలు విన్నవించారు.

మోడీని, జగన్‌కు గద్దెదిగే సమయం ఆసన్నమైంది: బాబూరావు

పాదయాత్రలో బాబూరావు మాట్లాడుతూ...మోడీ, జగన్ పాలన ప్రజలకు గుదిబండగా మారిందని, వీరికి గద్దె దిగే సమయం ఆసన్నమైందని దుయ్యబట్టారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి పరిపాలనలో పెద్దలే బాగుపడ్డారన్నారు. పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. మోడీ రైల్వేల గురించి మాట్లాడుతున్నారని, రైల్వే రంగాన్ని నాశనం చేసింది బిజెపి, మోడీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. విజయవాడతో సహా 150 రైల్వే స్టేషన్లను ప్రైవేట్ పరం చేసి, ఆదాని,అంబానీలకు అప్పచెప్పిందెవరని నిలదీశారు. రైల్వేలో సీనియర్ సిటిజన్లకు ఉన్న సౌకర్యాలు తొలగించారని, అంతేగాక టికెట్ ధరలు పెంచారని విమర్శించారు. ఉన్నట్టుండి ఎన్నికల సమయంలో రైల్వే ఆధునికరణ అంటూ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని దానికి మద్దతు ఇచ్చిన పార్టీలను ఓడించండని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం పక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించండని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.సి.హెచ్ శ్రీనివాస్, కష్ణ ,భూపతి రమణ, కె.దుర్గారావు, బి.సత్తిబాబు, టి.ప్రవీణ్. నగర్ కమిటీ సభ్యులు వై సుబ్బారావు, కాజా సరోజ, కాజా గురుమూర్తి, సిపిఐ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ...

మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతూ...

బెల్లపు సోమనాద్రి విగ్రహానికి నివాళులర్పిస్తూ...

కార్మికుడితో మాట్లాడుతూ...

'టిడిపి గెలుపునకు సమిష్టిగా కృషి'

ప్రజాశక్తి - విసన్నపేట : గెలుపుకోసం సమిష్టి కృషి చేయాలని టిడిపి, జనసేన నాయకులకు, కార్యకర్తలకు తిరువూరు నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. విస్సన్నపేట టౌన్ కమ్మ సేవా సమితి కళ్యాణమండపంలో టిడిపి మండల స్థాయి విస్తత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలికపూడి మాట్లాడారు. 2024 ఎన్నికల్లో సైకో పాలన పోవాలి సైకిల్ పాలన రావాలని అన్నారు. 50 రోజులు అందరం కలిసికట్టుగా పనిచేయాలని ప్రతి ఒక్క ఓటర్‌ని కలిసి వారు కోల్పోయిన మంచిని ఈ ప్రభుత్వం చేసిన చెడును తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. టిడిపి, జనసేన సమిష్టి కృషి తిరువూరు నియోజకవర్గాన్ని, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని)ని అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. అనంతరం వైసిపిలో చేరిన నల్లగట్లపై తీవ్ర విమర్శలకు దిగారు. తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు పార్టీ పట్ల గౌరవంతోనే ఉన్నారని కానీ ఇంత బలం ఉన్న నియోజకవర్గంలో అభ్యర్థిగా నిలబెడితే రెండుసార్లు ఓడిపోయారని నల్లగట్ల గురించి వ్యాఖ్యానించారు. టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొలికపూడి శ్రీనివాసరావు

ఆర్థిక సాయం అందజేస్తున్న బాబూరావు, తదితరులు

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : ఇటీవల విద్యుత్ షాక్ తగిలి మృతిచెందిన పద్మ కుటుంబానికి మంగళవారం రూ.7 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం, సిఐటియు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అండగా నిలిచి చేసిన పోరాటానికి ఫలితంగా ఈ ఆర్థిక సాయం అందింది. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఇవ్వాలని ప్రమాదస్థలం వద్దే ఒప్పందం చేసుకున్నారు. మృతురాలికి భర్త (ముఠా కార్మికుడు), ఇద్దరు పిల్లలున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులు వివిధ ఘటనలలో చనిపోతున్నారని, వారి కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయడం లేదన్నారు. జగన్ సర్కార్ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందే సంక్షేమ పథకాలను కార్మికులకు అందకుండా ఆదేశాలు జారీ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఉన్న నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని ప్రభుత్వం దారి మళ్ళించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.వెంకట్రావు, ఈ.వి.నారాయణ, సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, 50 వ డివిజన్ సిపిఎం కార్పొరేటర్ బోయి సత్య బాబు, జిఎంపిఎస్ నేత పెద్దబ్బాయి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు యం.బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పామర్రులో పర్యటిస్తున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత పామర్రు బందర్ మార్గంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ను జిల్లా కలెక్టర్ ఎస్పీతో కలిసి పరిశీలించారు. అక్కడ ప్రముఖులు, స్థానిక నాయకులు వేచి ఉండేందుకు దివ్యాంగులు స్పందన అర్జీలు ఇచ్చేందుకు ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ వరుసలు, పగోడాలు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ ప్రాంతంలో ఉన్న గడ్డివాములు, ఇంకా మిగిలిపోయిన గడ్డిని వెంటనే తొలగించి భూమిని చదును చేయాలన్నారు. అక్కడ ఒక వైద్య శిబిరంతో పాటు మంచినీటి సదుపాయము ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వారు అక్కడి నుండి బహిరంగ సభా స్థలికి చేరుకొని అక్కడ వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాకపోకలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధాన రహదారి నుండి సభాస్థలికి చేరుకునే రహదారి మార్గం చదును చేసే పనులు ముమ్మరం చేయాలన్నారు. ఈ పర్యటనలో ఉయ్యూరు ఆర్డిఓ డి రాజు, అదనపు ఎస్పీ జి వెంకటేశ్వరరావు, ఐఎస్ డబ్ల్యూ డిఎస్‌పి ఆశీర్వాదము, ఇన్స్పెక్టర్ అర్జున్ రాజు, ఆర్ అండ్ బి ఇంజనీరు శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ ఈ విజయ్ కుమారి, గుడివాడ డిఎస్పి శ్రీకాంత్, డిఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి: స్థానిక నిమ్మతోటలోని సియోను వృద్ధాశ్రమంలో మంగళవారం అక్షయ డెవలపర్స్ అధినేత, జనసేన నాయకులు మాదివాడ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసి ఆశ్రమంలోని వృద్ధులందరికీ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కృష్ణా సంయుక్త కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్, మండల అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, పూషడపు రత్నగోపాల్, సూదాని నందగోపాల్, తోట మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాడు సభను జయప్రదం చేయండి : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 28న తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు గ్రామంలో టిడిపి, జనసేన పార్టీ భారీ బహిరంగ సభకు గన్నవరం నియోజకవర్గం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని యార్లగడ్డ వెంకట్రావు కోరారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలనే లక్ష్యంతో ఇరు పార్టీల శ్రేణుల మధ్య మరింత సమన్వయం అవసరమని పేర్కొన్నారు. వైసిపి తప్పుడు ప్రచారాన్ని సమర్ధవంతంగా ఎదుర్కోవాలని తెలిపారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెడన: పట్టణంలోని రెండో వార్డుకి చెందిన నిరుపేద రిక్షా కార్మికుడికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కాగిత కృష్ణప్రసాద్ ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. షేక్ అమీర్ (హన్నా) గత కొన్ని నెలలుగా అనారోగ్యం కారణంగా రెండు కాళ్లకు ఆపరేషన్ చేయించుకుని కదల లేక ఇబ్బంది

పడుతున్నారని, కుటుంబ మనుగడ భారంగా ఉందని తెలిసి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర బీసీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, రాష్ట్ర శిష్టకరణ సాధికార సమితి సభ్యులు వీణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మందుల నిమిత్తం రూ.20,500, మూడు నెలలకు సరిపడా సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య , నాయకులు రెండవ నల్లా సాయిబాబు, పట్టిసపు పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభకు ప్రజలు తరలిరావాలి : జొన్నల

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మార్చి 1వ తేదీన పామర్రు పర్యటనకు వస్తున్నారని అక్కడ జరిగే బహిరంగ సభకు మండలంలోని ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని మండల జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సమావేశానికి ఎంపీపీ ఈడుపుగంటి రాజామణి, సర్పంచ్ పెనుమత్స రాధిక, ప్రాజెక్టు డైరెక్టర్ పి.శివరామకృష్ణ, ఏపిఎం జి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జొన్నల రామ్మోహన్‌రెడ్డి

పెదకళ్లేపల్లిలో హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-మోపిదేవి: పెదకళ్లేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానంలో 16 నెలలకుగాను మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధర్ రావు పర్యవేక్షణలో కృష్ణాజిల్లా దేవాదాయ శాఖ తనిఖీ కే శ్రీనివాస్ గ్రామస్తుల సమక్షంలో లెక్కించగా నగదు రూ.5,05,916, వెండి 96 గ్రాములు, గ్రాము బంగారం ఆదాయం వచ్చినట్లు ఇఒ తెలిపారు.

మినుము పైరు పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం బృందం మినుము పైరును మంగళవారం పరిశీలించింది. డిడిఎ కె.జ్యోతి రమణి మాట్లాడుతూ మినుము పైరులో ఉన్న తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు తగు మందులను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ కె.శ్రీనివాసరావు, ఏవో బి.పద్మజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెన్నేరు ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

నేటి నుంచి భవన కార్మికుల నిరవధిక దీక్ష

ప్రజాశక్తి-గుడివాడ: రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీలలో గుడివాడ ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే నిరవధిక దీక్షలను కార్మికులు జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రేపాని కొండ విజ్ఞప్తి చేశారు. మంగళవారం గుడివాడ సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కొండ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుండి వినియోగించుకున్న నిధులను తిరిగి సంక్షేమ బోర్డు కు జమ చేయాలని, 1214 మెమో రద్దు చేయాలని, భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించే నిరాహార దీక్షలను ప్రతి

సమావేశంలో మాట్లాడుతున్న కొండ

ఒక్కరు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జేమ్స్, తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శీతారామయ్య, కార్పెంటర్ యూనియన్ కార్యదర్శి ప్రభుదాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-పమిడిముక్కల : ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమని చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణకుమారి అన్నారు. మంగళవారం పమిడిముక్కల మండలంలోని చోరగుడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన పూర్ణకుమారి మాట్లాడుతూ గోపాల కృష్ణాపురం, చోరగుడి పరిసర ప్రాంత ప్రజలు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ కత్తూస్ సిహెచ్ఒ రమణి, పీహెచ్ఎన్ ఝాన్సీ, కృష్ణమోహన్, ఎఎన్ఎం ధరణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తాళ్లూరు వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు బాడిగ శేషగిరిరావు రామాయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్‌జిఇసి కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబిఎ చదువుతున్న విద్యార్థినికి ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. మచిలీపట్నం కు చెందిన పేద విద్యార్థిని పెదప్రోలు మేఘనకు మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యులు బాడిగ రామకృష్ణ తన బాడిగ శేషగిరిరావు -రామాయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాశాల ఫీజు నిమిత్తం 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం చెక్ ను శ్రీ కొండలమ్మ అమ్మ వారి ఆలయ అభివద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ బాడిగ నాని ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ విద్యార్థినికి అందజేశారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడలో కార్మికుల ఐక్యతతో ఎఐటియుసిని మరింత బలోపేతం చేసేందుకు మార్చి 27, 28వ తేదీలలో ఎఐటియుసి 12వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు, ఈ సభలను కార్మిక సంఘాలు విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎపిఎన్‌జివోస్ హాల్‌లో మహాసభల ఆహ్వాన కమిటి సమావేశాన్ని జిల్లా కన్వీనర్ టి.తాతయ్య, గౌరవ సలహాదారులు నార్ల వెంకటేశ్వరరావు, గౌరటవధ్యక్షులు ప్రసాద్, గూడపాటి ప్రకాష్‌బాబుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ కృష్ణాజిల్లా మంగళాపురం గ్రామానికి చెందిన అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పోరాటాల స్ఫూర్తితో ఎఐటియుసి కృష్ణాజిల్లా మహాసభలను గుడివాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 27న పట్టణంలో సుమారు పది వేల మందితో మహా పదర్శన, బహిరంగ సభను, 28వ తేదీ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐటియుసి పట్టణాధ్యక్షుడు గుజ్జర్లమూడి శేషు, ప్రధాన కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి

ఇగ్నో రీజినల్ డైరెక్టర్‌గా డాక్టర్ శర్మ నియామకం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజినల్ డైరెక్టర్ (ప్రాంతీయ కేంద్రం సంచాలకులు)గా డాక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్ర పూణేలో పనిచేస్తూ ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో హైదరాబాద్, విజయవాడ, మధురై, ఢిల్లీల్లో కూడా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విద్యార్థులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు, అలాగే దూరవిద్యను ఎక్కువ మందికి చేరువ చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన శర్మకు ప్రస్తుత రీజినల్ డైరెక్టర్ కె.సుమలత, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ బాబు, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి

పిఎఫ్ పథకాలు, సేవలపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలోని ఉద్యోగుల భవిష్య నిధి జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు భవిష్యనిధి పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పింఛనుదారులు, ఇతర వాటాదారులు, లబ్ధిదారులకు నిధి ఆప్కే నికత్ (ప్రొవిడెంట్ ఫండ్ మీ ముంగిట) కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో రెండు సెషన్లుగా ఈ కార్యక్రమాలు జరిగాయి. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ రూరల్ మండలం నున్న వికాస్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో విజయవాడలోని భవిష్య నిధి ప్రాంతీయ జిల్లా కమిషనర్-2 శ్రీకాంత్ రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ టిఎంకెవి.శేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ హరనాథ్ పాల్గొన్నారు. భవిష్య నిధి పథకాలు, సేవలపై వాటాదారులకు పూర్తి అవగాహన కల్పించారు. భవిష్యనిధి పరిధిలోకి వచ్చే పలువురు యజమానులు, ఉద్యోగులు, పింఛనుదారులు, ఇతర వాటాదారులు, లబ్ధిదారులు, కెడిసిసి బ్యాంక్ ఉద్యోగులు హాజరై తమ సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ ఎన్.సత్యనారాయణ రెడ్డి సత్కరించారు. అలాగే కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నంలోని హిందూ కాలేజీలో జరిగింది.

విఎంసి పారిశుధ్య కార్మికులకు మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వన్‌టౌన్: నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు మంగళవారం గాంధీ మున్సిపల్ హైస్కూల్లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విజయవాడ, ఇఎస్ఐ విజయవాడ, ఆంధ్ర హాస్పిటల్స్ సమన్వయంతో జరిగిన ఈ శిబిరంలో 400మందికి పైగా పారిశుధ్య కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇన్సూరెన్స్ మెడికల్స్ సర్వీసెస్ విజయవాడ డైరెక్టర్ బి.ఆంజనేయులు, ఇఎస్ఐ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి జ్యోతి, అక్కోస్ జనరల్ మేనేజర్ నాగప్రసాద్, ఇఎన్‌టి సర్జన్ డాక్టర్ కే నారాయణరావు, డెంటల్ సర్జన్ డాక్టర్ గౌతమి, డర్మాటాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సునీత, ఆయుర్వేద డాక్టర్ శ్యామల, హోమియోపతి డాక్టర్ సుప్రియ, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ నిఖిల్, డాక్టర్ శరత్, డాక్టర్ అనూష, విఎంసి మేనేజర్ బి శ్రీనివాస్, ఎస్వీఎస్ చలం, గార్లపాటి గోపి పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు

ఉండేలా, వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుకునేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ మువ్వల శ్రీధర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ద్వారా కుటుంబ ఆదాయాలు పెరుగుతాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.ప్రియాంక మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని 15 మండలాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆర్థిక సహకారంతో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ జన సురక్ష పథకాలను ప్రజలకు అందించడం కోసం పూర్తిస్థాయిలో శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ప్రతినిధి గౌతమ్, సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్ కుమార్, రాష్ట్ర సమన్వయకర్త వై.బాబురావు, జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాసరావు, విజయవాడ రూరల్ ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం కౌన్సిలర్లు చింతిరాల చక్రవర్తి, సగ్గుర్తి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి చేసే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపండి

జరిగాయని గుర్తుచేశారు. పదిహేనేళ్ల క్రితం చేపట్టిన గుణదల ఫ్లైఓవర్ నిర్మాణాన్ని టిడిపి, వైసిపి ప్రజాప్రతినిధులు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివద్ధి, రైల్వే ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జిలను కేంద్రం విస్మరించినా రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నోరుమెదపడంలేదని విమర్శించారు. మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం సగంలోనే నిలిచిపోయిందన్నారు. వాంబే కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయాలని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఓట్లు వేయించుకొని పార్టీలు మారే నేతలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పుకోలేని దుస్థితిలో ఆయా పార్టీల నేతలు ఉన్నారన్నారు. విఎంసిలో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న పదేళ్లలోనే ఎటువంటి పన్నులు, ఛార్జీలు పెంచకుండానే ప్రజారంజక పాలన అందించామని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడినందుకు బాబూరావుపై 30 అక్రమ కేసులు పెట్టారన్నారు. మిగిలిన రాజకీయపార్టీల ప్రజాప్రతినిధులపై భూకబ్జాలు, మోసాలకు పాల్పడినందున కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నగర కమిటీ సభ్యులు ఎం.సీతారాములు, కె.సరోజ, విజయవాడ హాకర్లు, తోపుడు బండ్ల యూనియన్ నాయకులు మురళి, భూలోకం, స్థానిక నాయకులు కే.వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆరు రోజులపాటు సాగిన పాదయాత్రలో పాల్గొన్న పార్టీ శ్రేణులకు, సహకరించిన వారందరికీ బాబూరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ సభకు ముఠా కార్మికులు, హాకర్లు, షాపు ఎంప్లాయీస్, ఇతర కార్మికులు పెద్దఎత్తున హాజరయ్యారు. సభకు విచ్చేసే సమయంలో నేతలకు పూల వర్షంతో కార్మికులు స్వాగతం పలికారు.

సత్యనారాయణపురంలో దారుణం

చేపల దాణా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వారంరోజుల క్రితం వక్కలగడ్డ మాధురి విజయవాడ సత్యనారాయణపురం లక్ష్మీనగర్ జాగర్లమూడి వారి వీధిలో నివాసముంటున్న తన తల్లి కుందేటి కనకదుర్గ ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. మాధురి విజయవాడలో ఉంటున్నట్లు తెలుసుకున్న నాని ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న కొబ్బరిబొండాల కత్తితో ఆమె మెడపై మూడుసార్లు నరికాడు. దీంతో మాధురి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆమెను కత్తితో నరికిన ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు సత్యనారాయణపురం పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు. నాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE, KADAPA
Crl.M.P. Nos: 206/2023 & 87/2024
Cr.No.653/2017 U/s. 406, 409, 420, 477(A), 201, 120 (B) IPC R/w 34 IPC and Sec.38(2) of the AP MACS Act 1995 and Sec.5 of A.P. Protection Depositors of Financial Establishment Act 1999 of Rayachoti U/G PS, Kadapa.

Between:
State represented by
Inspector of Police,
CID, RO, Tirupati. ...Complainant/Petitioner
And
1. AEGIS Green Farms and Constructions Ltd., Vijayawada CIN No. U70200 AP2010PLCO70045 represented by the accused Modadugu Sreenivasulu, Chief Managing Director of AEGIS Pariwar Mutually Aided Co-operative Credit Society Ltd., Vijayawada and its group companies.
Office Address: D.No.40-6/3-9, Vaishanavi Plaza, 33rd Floor, near VPS Public School, Mogalrajupuram, Vijayawada.
.... Respondent

NOTICE TO RESPONDENT

Inspector of Police, CID, RO, Tirupati గారు Cr.No. 653/2017 of Rayachoti P.S. కేస్‌లో Hon,ble Principal District & Sessions Judge, Kadapa నందు petition vide Crl.M.P. No: 206/2023 Under Sec.3 of Section 4 and sub section 4 of AP Protection of Depositors of Financial Establishment Act, 1999 మేరకు ఫైల్ చేసినారు. ఆ తర్వాత Notice ను News paper నందు publish చేయడానికి Crl.M.P. No: 87/2024 మేరకు ఉత్తర్వు ఇవ్వడమైనది. కావున పై తెలిపిన Respondent -1 అయిన మీరుతేది: 14.03.2024 న పై తెలిపిన Court హాజరు అయ్యి counter ఫైల్ చేయాలని తెలపడమైనది.

ఇట్లు
Inspector of Police,
CID, RO, Tirupati,
Dt: 28.02.2024.

వేలం ప్రకటన
మహారాజశ్రీ 3వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి, విజయవాడ వారి కోర్టులో
ఇ.పి.నెం. 89/2022 ఇన్ ఓ.యస్. నెం. 507/2017

బిట్వీన్ :
కోవెల ఎర్రయ్య ... పిటీషనరు/ డిహెచ్‌ఆర్
మరియు
కట్టా నాగరాజు, తండ్రి స్వాములు, డోర్ నెం. 126/11, కామయ్యతోపు బ్రిడ్జిడౌన్ రోడ్డు, శ్రీనివాసనగర్, తాడిగడప గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా ... రెస్పాండెంట్ / జె.డి.ఆర్.

డిహెచ్‌ఆర్ యొక్క బాకీ వసూళ్ల నిమిత్తం పై కోర్టులో ది. 15-03-2024న ఉదయం 10-30 గం.లకు జెడిఆర్‌కు సంబంధించిన ఈ క్రింది ఆస్థి అమ్మకము మరియు వేలము నిర్వహించబడును. ఆసక్తి గల బిడ్డర్లు పాల్గొని పాడుకోగలరని ఇందుమూలంగా యావన్మందికి తెలియపర్చడమైనది.

షెడ్యూలు

కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామపంచాయతీ పరిధిలోని డాక్యుమెంట్ నెం. 1840/1999గా గల డోర్ నెం. 6-2, రీ.సర్వే నెంబరు 296/1, ప్లాటు నెం.9 లో గల చ.గ. 209 ఖాళీ స్థలమునకు హద్దులు.
తూర్పు : ప్లాటు నెం.10, దక్షిణం : 33 అడుగుల రోడ్డు, పడమర : ప్లాటు నెం.8, ఉత్తరం : ప్లాటు నెం. 12 మరియు రోడ్డు.
యీ నాలుగు హద్దుల మధ్య గల చ.గ. 209 ఖాళీ స్థలము.
డిక్రీ హోల్డరు విలువ : రూ.10,00,000/-లు
అమీనా విలువ : రూ.8,50,000/-లు
మార్కెట్ విలువ : రూ. 8,50,000/-లు
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వేలముతేది : 15-03-2024
ఫరదర్ హియరింగ్ : 22-03-2024

ఇట్లు
యస్.కె.రహిమాన్, అడ్వకేట్, పోరంకి, విజయవాడ.
విజయవాడ
తేది:27-2-2024
సెల్ : 9705726440

మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. నెం. 540/2023

బిట్వీన్ :
సౌమ్య చింతలపూడి ....వాది
మరియు
తేళ్ళ శ్రీనివాసరావు,
ప్రొప్రయిటర్ : శ్రీశ్రీ ఫార్మాస్యూటికల్స్ .... ప్రతివాది
టు,
తేళ్ళ శ్రీనివాసరావు, ప్రొప్రయిటర్ : శ్రీశ్రీ ఫార్మాస్యూటికల్స్, షాపు నెం. జిఎస్-36, గ్రౌండ్‌ఫ్లోర్, వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్, గొల్లపూడి, విజయవాడ రూరల్ మండలం, ఎన్‌టిఆర్ జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు దావా సమన్లు నిమిత్తం ది. 05-03-2024వ తేదీన వాయిదా వుండివున్నది. కనుక ఆ రోజున ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేక మీ ప్లీడరుగారి ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 05-03-2024

ఇట్లు
డి.పి.రామకృష్ణ,
వాది తరపు న్యాయవాది

మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ. ఎ. నెం.1153/2022 ఇన్ ఐఎ నెం.145/2017 ఇన్ ఓఎస్ నెం.121/2008

బిట్వీన్:
రాచప్రోలు సుజాత ..... పిటిషనర్/ వాది
మరియు
కొప్పుల వెంకటేశు(డైడ్) మరియు ఇతరులు
...... రెస్పాండెంట్స్/ ప్రతివాదులు
టు : రెస్పాండెంట్ నెం.17
కాకి కుసుమ వైఫ్ ఆఫ్ కృష్ణారావు, హిందువు,
23 సం.లు, పాత రేపూడి గ్రామము,
ఎ.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా.

పైన తెలియపరిచిన ఐ.ఎ. నెం.1153/2022లో పిటీష నరు సెక్షన్ 5 లిమిటేషన్ యాక్టు పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో రెస్పాండెంట్ నెంబర్ 17 కు అనేకసార్లు కోర్టు ద్వారా నోటీసు పంపియున్ననూ అందివుండలేదు. శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్ నెంబర్ 17 కు పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు నోటీసు వాయిదా ది.06-03- 2024వ తేదీన ఉండియున్నది. కావున వాయిదా రోజు న్యాయవాది గారి ద్వారా గానీ లేదా మీరుగానీ శ్రీకోర్టు వారి ఎదుట ది. 06-03-2024వ తేదీన హాజరు కాగలరు. లేనియెడల పిటీషను పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులననుసరించి
అత్తునూరి ప్రభాకరరెడ్డి, బీఎస్సీ, బిఎల్
తిరువూరు **అడ్వకేట్, తిరువూరు,**
ది.27-02-2024 **సెల్ నెం.944 0989132**

మహారాజశ్రీ నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 250/2022 in O.S. No. 181/2011

Between:
గారపాటి చంద్రశేఖర్ **-పిటీషనర్**
అండ్
1. కొమ్మారెడ్డి పద్మనాభయ్య (డైడ్) వగైరాలు
-రెస్పాండెంట్స్

To:
R-7: కొమ్మారెడ్డి సాహితి, D/o. late పద్మనాభయ్య, 24 సం॥లు, R/o. ఫ్లాట్ నెంబర్ 96, రోడ్ నెంబర్ 4, నియర్ ఫన్ టైమ్స్ క్లబ్, శ్రీనివాస నగర్, విజయవాడ-8, విజయవాడ JCJC.

పై నెంబర్ దావాలో చనిపోయిన 1వ ప్రతివాది కొమ్మారెడ్డి పద్మనాభయ్య కు వారసులుగా మిమ్ములను చేర్చమని పిటిషనరు పై నెంబర్ పిటిషన్ I.A. No. 250/2022 దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీ హాజరు నిమిత్తం **ది. 27-03-2024వ తేదీన వాయిదా అయి వున్నది. కావున ఆరోజు ఉదయం 10.30 గంటలకు** మీరు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షమున సదరు పిటిషన్ తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
G.SRINIVASA REDDY
Nuzvid Advocate, Gandhinagar
Dt.27-02-2024 Nuzvid

మహారాజశ్రీ గౌరవనీయులైన మోటార్ యాక్సిడెంట్ క్లయిమ్స్ ట్రిబ్యునల్ కమ్ 7వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు : విజయవాడ.
యమ్.వి.ఓ.పి. నెం. 391/2019

బిట్వీన్ :
అమర్తలూరి శ్రీలక్ష్మి మరియు 4 గురు...పిటీషనర్లు
మరియు
నసీర్ అహ్మద్ మరియు ఇరువురు (2)... రెస్పాండెంట్లు
టు : రెస్పాండెంట్ నెం.1 :
నసీర్ అహ్మద్, తండ్రి : బుర్హాన్ షా, ముస్లిం, వయస్సు 43 సం॥లు, నివాసం : డోర్ నెం. 20-2-500, హుస్సేని ఆలం, బహదురపుర, అజాం హాస్పిటల్ ఎదురుగా, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.

పై నెంబరు పిటిషన్ నందు 1వ రెస్పాండెంట్ నోటీసు నిమిత్తం ది. 28-3-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. సదరు పై తేదీ 1వ రెస్పాండెంట్ గాని, వకీలు ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. ఆక్షేపణలు వున్న యెడల పైన తెలిపిన కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు హాజరై తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపర్చడమైనది.
వాయిదాతేది : 28-3-2024

ఇట్లు
జి.పి.రాజు,
కె.వెంకట నారాయణ
న్యాయవాదులు,
డోర్ నెం. 43-150-4, న్యూఅజిత్‌సింగ్ నగర్,
విజయవాడ-15. సెల్ : 99630 48085

మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ. ఎ. నెం.1155/2022 ఇన్ ఐ. ఎ. నెం.145/2017 ఇన్ ఓఎస్ నెం.121/2008

బిట్వీన్:
రాచప్రోలు సుజాత ..... పిటిషనర్/ వాది
మరియు
కొప్పుల వెంకటేశు(డైడ్) మరియు ఇతరులు
...... రెస్పాండెంట్స్/ ప్రతివాదులు
టు : రెస్పాండెంట్ నెం.17
కాకి కుసుమ వైఫ్ ఆఫ్ కృష్ణారావు, హిందువు,
23 సం.లు, పాత రేపూడి గ్రామము,
ఎ.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా.

పైన తెలియపరిచిన ఐ.ఎ. నెం.1155/2022లో పిటీషనరు లీగల్ రిప్రజెంట్ టు పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో రెస్పాండెంట్ నెంబర్ 17 కు అనేకసార్లు కోర్టు ద్వారా నోటీసు పంపియున్ననూ అందివుండలేదు. శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్ నెంబర్ 17 కు పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు నోటీసు వాయిదా ది.06-03- 2024వ తేదీన ఉండియున్నది. కావున వాయిదా రోజు న్యాయవాది గారి ద్వారా గానీ లేదా మీరుగానీ శ్రీకోర్టు వారి ఎదుట ది. 06-03-2024వ తేదీన హాజరు కాగలరు. లేనియెడల పిటీషను పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులననుసరించి
అత్తునూరి ప్రభాకరరెడ్డి, బీఎస్సీ, బిఎల్
తిరువూరు **అడ్వకేట్, తిరువూరు,**
ది.27-02-2024 **సెల్ నెం.944 0989132**

మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ. ఎ. నెం.1154/2022 ఇన్ ఐఎ నెం.145/2017 ఇన్ ఓఎస్ నెం.121/2008

బిట్వీన్:
రాచప్రోలు సుజాత ...... పిటిషనర్/ వాది
మరియు
కొప్పుల వెంకటేశు(డైడ్) మరియు ఇతరులు
...... రెస్పాండెంట్స్/ ప్రతివాదులు
టు : రెస్పాండెంట్ నెం.17
కాకి కుసుమ వైఫ్ ఆఫ్ కృష్ణారావు, హిందువు,
23 సం.లు, పాత రేపూడి గ్రామము,
ఎ.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా.

పైన తెలియపరిచిన ఐ.ఎ. నెం.1154/2022లో పిటీషనరు ఆర్డరు 22 రూల్ 9 క్రింద పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో రెస్పాండెంట్ నెంబర్ 17 కు అనేకసార్లు కోర్టు ద్వారా నోటీసు పంపియున్ననూ అందివుండలేదు. శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్ నెంబర్ 17 కు పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు నోటీసు వాయిదా ది.06-03- 2024వ తేదీన ఉండియున్నది. కావున వాయిదా రోజు న్యాయవాది గారి ద్వారా గానీ లేదా మీరుగానీ శ్రీకోర్టు వారి ఎదుట ది. 06-03-2024వ తేదీన హాజరు కాగలరు. లేనియెడల పిటీషను పరోక్షముగా తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులననుసరించి
అత్తునూరి ప్రభాకరరెడ్డి, బీఎస్సీ, బిఎల్
తిరువూరు **అడ్వకేట్, తిరువూరు,**
ది.27-02-2024 **సెల్ నెం.944 0989132**

ప్రశాంతంగా ఎపి టెట్ ప్రారంభం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) -2024 విజయవాడలో ఏర్పాటు చేసిన అన్ని పరీక్షా కేంద్రాల్లో మంగళవారం ప్రారంభమైంది. మొదటిరోజు పేపర్ 1 (ఎ) పరీక్షకు ఉదయం సెషన్ లో 17,136 మందికి 14,801 (86.37 శాతం) మంది, మధ్యాహ్నం సెషన్‌లో 17,253 మందికి 15,104 (87.54 శాతం) మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు బయో మెట్రిక్ హాజరు తప్పనిసరి చేయడం వల్ల తొలి రోజు రాష్ట్రవ్యాప్తంగా 40 మంది అభ్యర్థులకు మాత్రమే ముఖ హాజరు (ఫెషియల్ అటెండెన్స్) తీసుకున్నారు. దీనితో అక్కడక్కడ సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. ఏ అభ్యర్థికి నష్టం కలగకుండా వెంటనే సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఆ అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు.

హాల్ టికెట్లో వివరాలు తప్పయితే సవరించుకోవచ్చు

టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల పేరు, వివరాలు హాల్ టికెట్ లో పూర్తిగా తప్పుగా ఉన్నట్లయితే వారికి పరీక్ష రాయడానికి అనుమతి లేదు. అయినప్పటికీ అభ్యర్థికి సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాధికారి క్షుణ్ణంగా పరిశీలించి సదరు అభ్యర్థన సరైనదని భావిస్తే, పూర్తి సవరణల వివరాలను రాష్ట్ర స్థాయిలోని కమాండ్ కంట్రోల్ రూం వారికి తెలియచేయాలి. అలాంటి అభ్యర్థులకు తర్వాతి సెషన్లో పరీక్ష రాసేలా బఫర్ హాల్ టికెట్ ఇవ్వనున్నట్లు కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు.

ఆ అభ్యర్థుల ఫీజు తిరిగిచ్చేస్తాం

అక్షర దోషాలు ఉన్నట్లయితే డిపార్ట్మెంటల్ అధికారి అభ్యర్థి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి పరీక్షకు అనుమతించాలని తెలిపారు. కోర్టు ఉత్తర్వుల వల్ల బీఈడీ అభ్యర్థులకు పేపర్ 1ఏ రాయడానికి అనుమతిలేకపోవడం వల్ల వారు చెల్లించిన ఫీజు అభ్యర్థి ఖాతాకు జమచేస్తామన్నారు. అదే విధంగా డీఈడీ, బీఈడీ రెండు అర్హతలు కలిగిన అభ్యర్థులు పేపర్ 1 (ఎ) రాయడానికి వీలుగా బఫర్ హాల్ టికెట్లు అందజేస్తామన్నారు. అభ్యర్థులకు పరీక్షాపరంగా ఏవైనా సమస్యలు ఎదురైతే పరీక్షా తేదీకి ఒకట్రెండు రోజులు ముందుగా జిల్లా విద్యాధికారిని సంప్రదించాలని కోరారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

తొలి రోజు విజయవాడలోని ఏపీ టెట్ పరీక్షా కేంద్రాలైన గవర్నర్ పేటలోని ఎస్.వి.టి ఇన్ఫోటెక్ పరీక్షా కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, శ్రీ విజయదుర్గా ఐటీ సొల్యూషన్స్ (రామవరప్పాడు), ఐఆన్ డిజిటల్ జోన్ (కానూరు) పరీక్షా కేంద్రాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు సందర్శించారు. అభ్యర్థుల పరీక్షల రాసే తీరును, పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ డిల్లీ రావు, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలోని నోవా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నిమ్రా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నిమ్రా కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ భవనాలను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించి తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్, విజయవాడ పశ్చిమ, తిరువూరు, నందిగామ నియోజవర్గాల ఓట్ల లెక్కింపునకు నోవా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని ప్రతిపాదించినట్లు తెలిపారు.

జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు నియోజకవర్గాలకు నిమ్రా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని, మైలవరం నియోజకవర్గానికి నిమ్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను ప్రతిపాదించినట్లు వివరించారు. పరిసర ప్రాంతాలలో నిరంతర సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా, బ్యారికేడింగ్ ఏర్పాట్లు చేయడం పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు చేర్చి భద్రపరచడం, అనంతరం వాటిని కౌంటింగ్ కేంద్రాలకు చేర్చడం, కౌంటింగ్ ప్రక్రియ మొదలగు అంశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, విమర్శలకు తావులేకుండా అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా, పకడ్బందీగా పటిష్ట ప్రణాళికతో బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డిఒ బీహెచ్ భవానీ శంకర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సిపి

పౌర హక్కులపై దాడి అమానుషం

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఎపి జెఎసి చైర్మన్ బండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

రాజ్యాంగం ప్రసాదించిన హక్కుతో ఉద్యోగులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని జెఎసి చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగుల అక్రమ అరెస్టులకు నిరసనగా గాంధీనగర్‌లోని ఎన్జీవో హోం దగ్గర జిల్లా జేఏసి చైర్మన్ ఎ.విద్యాసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ధర్నా కార్యక్రమంలో బండి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపేందుకు ధర్నా చౌక్‌లో ఈ నెల 22వ తేదీన ఉద్యోగులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసనలు తెలుపుతున్న ఉద్యోగులపై కేసులు నమోదు చేయటం ఉద్యోగులను అవమానించడమేనన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగులు న్యాయమైన సమస్యల పరిష్కారానికి నిరసన ప్రదర్శనకు పిలుపు ఇస్తే ఉద్యోగులను, వారి కుటుంబాలను కూడా వేధించడం, ముందస్తుగా గృహనిర్బంధం చేయడం ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. తాము ప్రభుత్వ ఉద్యోగులమే తప్ప...అసాంఘిక శక్తులం కాదని ప్రభుత్వం గుర్తించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి, విశ్రాంత జీవితం గడుపుతున్న 70 సంవత్సరాల పైబడిన వృద్ధులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడాన్ని ప్రభుత్వ పెద్దలు ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో చర్చించేందుకు ఈ 28వ తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. తాము లేవనెత్తిన 49 డిమాండ్లలో కొన్నింటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వల్లనే తమ మహా ఆందోళన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి, సహాధ్యక్షులు పురుషోత్తమ నాయుడు, కోశాధికారి రంగారావు, ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, కార్యనిర్వాహణ కార్యదర్శి కె. జగదీశ్వరరావు, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షులు షేక్ జానీ బాషా, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు విష్ణువర్ధన్ రావు, జి. నారాయణరావు, ఏపీ ఎన్జీవోస్ జిల్లా నాయకులు యం. రాజుబాబు, జి. రామకష్ణ, డి. విశ్వనాథం, మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి కె.శివలీల తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ది కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సహకారంతో మంగళవారం ఆటోనగర్‌లో కళాజాతా నిర్వహించారు. ఈప్రదర్శన ద్వారా హెచ్ఐవి (ఎయిడ్స్), ఎఆర్‌టి మందులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్, ఏపీ శాక్స్, కెడిఎల్ఓఎ ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ వీవీ సాంబశివరావు, ఎఎన్ఎం శాంతకుమారి, సిబ్బంది ఎ.వరప్రసాద్, ఎం.శేషుకుమార్, వై.రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో సమీక్ష

ప్రజాశక్తి-విజయవాడ : గవర్నరుపేటలోని ఠాగూర్ గ్రంథాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రంథాలయ సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా చైర్‌పర్సన్ జమలా పూర్ణమ్మ, కార్యదర్శి ఎం.వి.డి.టి.నగేష్ పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 109 బ్రాంచ్‌ల ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. డిపాజిట్ లక్ష్యాలు, గ్రంథాలయ సెక్స్ వివరాలు, గ్రంథాలయ మౌలిక వసతులు, గ్రంథాలయ భవన రిపేర్లు తదితర అంశాలను చర్చించారు. ఠాగూర్ గ్రంథాలయాధికారి కె.రమాదేవి పాల్గొన్నారు.

మీ సేవ ఉద్యోగుల సమస్యలపై ఎంఎల్‌సి లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : మీ సేవ ఉద్యోగుల సమస్యలపై మంగళగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శిని మంగళవారం పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు కలిసి విన్నవించారు. గవర్నమెంట్ అర్బన్ ఇ సేవా సెంటర్లలో పనిచేసిన 607 మంది ఉద్యోగులను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి (ఇ) మీ సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి, జనసేన టిడిపి నేతలతో కలిసి జండా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యు రాలు తంగిరాల పాల్గొన్నారు. అనంతరం నందిగామ నియోజకవర్గం తెలుగుదేశం జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తంగిరాల సౌమ్య పేరు ఖరారు కావడంతో స్థానిక జనసేన, తెదేపా నేతలతో కలిసి సౌమ్యకు రమాదేవి శాలువాతో సత్క రించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్లో కొత్త రాయల్ ఎన్ ఫీల్డ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మార్కెట్లో కొత్త రకం షార్ట్ గన్ 650 మోడల్నే మాచవరంలోని సన్‌మోటార్స్‌లో లాంచ్ చేశారు. ఈ వెహికల్ నాలుగు రంగుల్లో లభిస్తాయని అన్నారు. దీని షోరూమ్ ధర 3.59 లక్షలు నుండి 3.73 లక్షల వరకు వివిధ రకాలలో లభిస్తాయని షోరూం ఎండి యన్నం హర్ష తెలిపారు. ప్రస్తుతానికి షోరూం బైక్ చూడటానికి అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. మార్చి మొదటి వారం నుండి టెస్ట్ రైడ్ మాచవరం మోటార్స్‌లో వాటిలో ఉంటుందని అన్నారు. షార్ట్ గన్ మోడల్‌ని మార్కెట్లోకి లాంచ్ బుకింగ్స్‌ని ప్రారంభించారు. కనుక వినియోగదారులు మాచవరంలోని సన్ మోటార్స్ షోరూమ్‌ని సందర్శించాలని కోరారు.

అధికారులకు శిక్షణ ఇస్తున్న ఆర్డిఓ సాయిబాబు

ఎన్నికల అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ కే వి ఆర్ కాలేజ్ నందు నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి పి.సాయిబాబు అధ్యక్షతన నందిగామ మండలం బూత్ లెవల్ స్థాయి అధికారులకు మాస్టర్ ట్రైనర్ల చేత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నందిగామ రెవెన్యూ డివిజన్ అధికారి పి.సాయిబాబు బూత్ స్థాయి అధికారులకు వారి యొక్క విధి బాధ్యతల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ తహాశీల్దార్ సరస్వతి, నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, ఎలక్షన్ సెక్టార్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు కేలో ఇండియా ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, యన్‌టిపిసి, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న నగరంలోని ఓల్గా ఆర్చరీ అకాడమిలో కేలో ఇండియా యన్‌టిపిసి విజయవాడ సిటీ లెవల్ ఓపెన్ ఆర్చరీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎపి ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో విజయవాడ సిటీ, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 120 మంది అన్ని ఏజ్ గ్రూపులలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ఆర్చర్‌లు పాల్గొంటారని తెలిపారు. పోటీలను ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు ఎపి ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. పోటీలు అండర్ -9, అండర్ -12, అండర్ -14 విభాగాలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో ఇండియన్ రౌండ్, రికర్వ్ రౌండ్, కాంపౌండ్ విభాగాలలో పోటీలు ఉంటాయని తెలిపారు.

పాము కాటుకు వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : పాము కాటు వేయడంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని డబ్బాకుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది ఆ గ్రామానికి చెందిన మల్లె పోయిన పిచ్చమ్మ (75 తెల్లవారుజామున నిద్రలేచే క్రమంలో ఏదో కుట్టినట్లు ఉందని కుటుంబ సభ్యులకు తెలిపింది. బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం పాటు కాటేసినట్లు వైద్యులు గుర్తించారు. వైద్య సేవలందిస్తుండగానే ఆమె మృతి చెందింది.

యువతకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు

డిప్యూటీ డైరెక్టర్ వి.హిమబిందు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : రాష్ట్ర ప్రభుత్వం జాబ్ మేళాల ద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఉపాధి కల్పన శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.హిమ బిందు తెలిపారు. ఉపాధి కల్పన శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త అధ్వర్యంలో బుధవారం విజయవాడ ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో జరిగిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన హిమ బిందు మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి కల్పన శాఖ అందించే సేవలన్నిటిని భారత ప్రభుత్వం వారి నేషనల్ కెరియర్ సెంటర్‌తో అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఇంజినీరింగ్, డిగ్రీ, ఎంబిఎ, ఐటిఐ తదితర ఇతర టెక్నికల్ రంగాలపై నేటి యువత మక్కువ చూపడంతో వారి అవసరాలకు అనుగుణంగా ఉపాధి కల్పన శాఖ సేవలన్నిటిని ఎంప్లాయిమెంట్ వెబ్ పోర్టల్ ద్వారా మరింత సులభతరం చేశామని ఆమె తెలిపారు. అనంతరం రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి రామ్మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు మాట్లాడుతూ యువత ఉపాధి సాధించేందుకు మెలుకువలు పాటించాలని అన్నారు. ఇంటర్వ్యూ చేసే వారిని మెప్పించేందుకు అవసరమైన కమ్యూనికేషన్స్ స్కిల్స్ పట్ల విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. లాంగ్వేజెస్‌లో కమ్యూనికేషన్స్ స్కిల్స్‌ను ఎంతగా ఇంప్రూవ్ చేసుకుంటారో.. మీ భవిష్యత్ అంత బాగుంటుందన్నారు. అనుకున్నది ఎఫెక్టివ్‌గా చెప్పడం, ఎదుటివారికి అర్థమయ్యేలా మీ అభిప్రాయాన్ని వివరించడమనేది కమ్యూనికేషన్స్ స్కిల్స్‌లో ముఖ్యమన్నారు. నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ జాబ్ మేళాకు దాదాపు 210 మంది హాజరయ్యారని అందులో ఇంటర్వ్యూ ద్వారా 53 మంది ఎంపికయ్యారని అయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.సత్య బ్రహ్మం, ఎస్.జయరాజు, ప్లేస్మెంట్ అధికారి మధు సంస్థల ప్రతినిధులు నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

జాబ్ మేళా నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల బరిలో జై భీమ్‌రావు భారత్ పార్టీ

మంగళగిరి నుండి జడ శ్రావన్‌కుమార్ పోటీకి సిద్ధం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జై భీమ్ రావ్ భారత్ పార్టీ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది జడ శ్రావన్ కుమార్ తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న 61 ఎంఎల్ఎలు, ఏడుగురు ఎంపీ అభ్యర్థులను మొదటి లిస్టు ప్రకటించినట్లు తెలిపారు. మార్చి రెండో వారంలో మిగిలిన అభ్యర్థులు అందరినీ ప్రకటించనున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం, అలాగే తాడికొండ నియోజకవర్గంలో తాను పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. విజయవాడ వెస్ట్ నుండి పరసా సురేష్, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా దాట్ల లూరల్దు పోటీ చేయనున్నారని తెలిపారు.

ప్రజలకు, బ్యాంకులకు వారధిగా ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఆర్‌కె.మహాన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : బ్యాంకు పథకాలు, సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఆర్.కె.మహాన అన్నారు. మంగళవారం విజయవాడ రూరల్‌మండలం, రామవరప్పాడు గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్పిస్తున్న సామాజిక భద్రత పథకాలు, డిజిటల్ చెల్లింపు వ్యవస్థలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, గ్రామీణ ప్రజలకు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండేలా, వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుకునేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లకు సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ మువ్వల శ్రీధర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ద్వారా కుటుంబ ఆదాయాలు పెరుగుతాయన్నారు. ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దటంలో ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.ప్రియాంక, సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ప్రజలకు అందే సామాజిక సేవా పథకాలను విస్తతంగా ప్రచారం చేయాలని కౌన్సిలర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ప్రతినిధి గౌతమ్, సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్ కుమార్, రాష్ట్ర సమన్వయకర్త వై. బాబురావు, జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాసరావు, విజయవాడ రూరల్ ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం కౌన్సిలర్లు చింతిరాల చక్రవర్తి, సగ్గుర్తి వినోద్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల చేస్తున్న మహాన

పెర్నాడ్ రికర్డ్ సంస్థ కార్యకలాపాల విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

పరిశ్రమ రంగంలో అగ్రభాగాన ఉన్న పెర్నాడ్ రికర్డ్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను విస్తరిం చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సంస్థ సీఈవో జీన్, కార్పొరేట్ హెడ్ ప్రసన్న మొహిలే ఒక ప్రకటనలో తెలిపారు. మేక్ ఇన్ ఇండియా విజన్‌లో భాగంగా వ్యాపార విస్తరణకు సిద్ధం చేసినట్లు తెలిపారు. సుమారు 200 మిలియన్ యూరోల వరకు పెట్టుబడి పెట్టేందుకు కంపెనీ నిర్ణయించినట్లు తెలియ చేశారు. తమ సంస్థ రానున్న కాలంలో మరింత స్థాయిలో విస్తరించనుందని తెలిపారు.

శామ్‌సంగ్ గెలాక్సీ బుక్ 4 విక్రయాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఎలక్ట్రానిక్స్ విభాగంలో అగ్రభాగాన ఉన్న శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 సిరీస్‌ను సరికొత్తగా తీసుకు వచ్చాయమని అన్ని ఎలక్ట్రానిక్ షోరూమ్‌లలో విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు శామ్‌సంగ్ రీజనల్ ఇన్‌ఛార్జి కె.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ షోరూమ్‌లో గెలాక్సీ బుక్ 4 సిరీస్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలాక్సీ బుక్ 4 సిరీస్ కొత్త ఇంటెలిజెంట్ ప్రొసెసర్ అని మరింత స్పష్టమైన, ఇంటరాక్టివ్ డిస్‌ప్లే కలిగి ఉంటుందన్నారు. బలమైన సెక్యూరిటీ సిస్టమ్‌తో తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇది అత్యుత్తమ ఉత్పాదకత, కనెక్టివిటీ అందించే ఎఐ పీసీలకు ఉపయోగించవచ్చని తెలిపారు. బుక్ 4 సిరీస్ చిప్ స్మార్ట్‌ఫోన్‌లోనూ లేదా టాబ్లెట్‌లోనూ ఆప్టిమైజ్ చేసుకునేలా రూపొందించారని తెలిపారు.

మహా శివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట

మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం సదరు దేవస్థానం ప్రాంగణంలో నందిగామ రెవెన్యు డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు, 2024 ఏర్పాట్ల గురించి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం (కో ఆర్డినేషన్ మీటింగ్) నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీసు, పంచాయితీ రాజ్, దేవదాయ ధర్మాదాయ, ఆర్.డబ్ల్యూ.ఎస్, ఇరిగేషన్, ఫైర్, ఎక్సైజు, ఫిషరీస్, మెడికల్ అండ్ హెల్త్ ఆర్అండ్‌బి తదితర శాఖల అధికారులకు ఏర్పాట్లకు సంబంధించి తగు ఆదేశాలిచ్చారు. నందిగామ ఎసిపి డాక్టర్ బి.రవి కిరణ్, వంశపారంపర్య ధర్మకర్త తరుపున కెసిపి సిమెంట్స్ లిమిటెడ్ ప్రతినిధి పి.రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.